# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 15-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 81 శాతం పోలింగ్ నమోదయ్యిందని అంచనా వేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు.**

2. **పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ తెలిపింది.**

3. **డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ-దోస్త్‌లో విద్యార్థులు ఈనెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని తెలంగాణ ఉన్నత విద్యామండలి తెలిపింది.**

4. **అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.**

5. **ద్రోణి ప్రభావంతో రానున్న ఐదు రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 81 శాతం పోలింగ్ నమోదయ్యిందని అంచనా వేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 2 గంటల వరకూ పోలింగ్ జరిగిందని, జిల్లాల నుంచి వచ్చిన సమాచారాన్ని ఎన్నికల సంఘం పరిశీలిస్తోందని అన్నారు. 1.20 శాతం పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి ఈసారి పోలింగ్ 80 శాతం దాటే అవకాశం ఉందని తెలిపారు.

-------------------------

పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల విభాగం డైరెక్టర్ డి. దేవానందరెడ్డి తెలిపారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు ఈరోజు నుంచి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. హాల్ టికెట్లు www.bse.ap.gov.in అందుబాటులో ఉంటాయని తెలిపారు.

-------------------------

కాంగ్రెస్, బిజెపిలు మినహా ఇతర రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో 90 శాతానికి పైగా

పరిష్కరించామని, ప్రధాన ఫిర్యాదులేవీ పెండింగ్‌లో లేవని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల నియమావళి అమలుపై కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా రెండో నివేదికను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసిన 425 ప్రధాన ఫిర్యాదుల్లో 400 కేసులను పరిష్కరించినట్టు ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. వీటిలో కాంగ్రెస్ 170, బిజెపి 95, ఇతర పార్టీలు 160 ఫిర్యాదులు దాఖలు చేశాయని, కాంగ్రెస్, బిజెపీలు – ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై పరస్పరం చేసుకున్న ఫిర్యాదులు పెండింగ్‌లో వున్నాయని ఎన్నికల సంఘం తెలిపింది. దేశంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి దాదాపు రెండు నెలలు పూర్తయ్యిందని, ఇప్పటివరకు జరిగిన ప్రచారం దాదాపు హింసారహితంగా, ప్రలోభాలు, గందరగోళానికి తావు లేకుండా సాగిందని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

---------------------------

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ–దోస్త్‌లో విద్యార్థులు ఈనెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. గతంలో ఈ నెల 15వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని ప్రకటించామని... విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాల వినతి మేరకు దాన్ని సవరించామన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

---------------------------

తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోటీలో 52 మంది అభ్యర్థులు ఉన్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తం 63 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 11 మంది ఉపసంహరించుకున్నారు. ఈనెల 27వ తేదీన 12 జిల్లాల పరిధిలో పోలింగ్ జరగనుంది. జూన్ 5న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఉపఎన్నిక జరిగే మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 4 లక్షల 61 వేల 806 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొంది.

---------------------------

ఎన్నికల పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలు కారణంగా ఎన్నికల సంఘం 144 సెక్షన్ అమలుకు ఆదేశించింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పోలీసు శాఖకు ఉత్తర్వులిచ్చారు. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, పెదకూరపాడు. గురజాల, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ముగ్గురికి మించి ఎక్కువ మంది గుమికూడొద్దని, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, అనుమానాస్పదంగా సంచరించకూడదని పోలీసు అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలలో 2024 – 25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు నిన్న విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్. నరసింహారావు నిన్న విజయవాడలో ఈ ఫలితాలను విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్, అభ్యర్థి నమోదు చేసిన పాఠశాల ప్రాధాన్యతా క్రమం ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 9 నుంచి 13 పార్లమెంటు స్థానాలను గెలుస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అన్నారు. పోలింగ్ సరళిపై హైదరాబాద్‌లో నిన్న ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ పరిపాలన కార్యక్రమాలపై దృష్టి సారిస్తామని తెలిపారు. రైతు రుణమాఫీ, విద్యా సంవత్సరానికి ఏర్పాట్లు, పుస్తకాలు, యూనిఫామ్, సన్నబియ్యం సరఫరా వంటి తదితర అంశాలపై సమీక్ష చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నీటి కాలువలకు మరమ్మతులు చేపట్టాలని జనసేన అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ కోరారు. నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాలువల నిర్వహణ పనులపై దృష్టిపెట్టలేదని అన్నారు. సాగు నీటి అవసరాలు తీర్చే కాలువలు, వాటికి సంబంధించిన సరఫరా వ్యవస్థలకు అవసరమైన నిర్వహణ, మరమ్మతులు వేసవి సమయంలో చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై జలవనరుల శాఖతో సమీక్షించాలన్నారు. ప్రభుత్వ అధికారులు కాలువలకు సంబంధించిన నిర్వహణ పనులపై దృష్టి సారించాలని తెలిపారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్ష –టీఎస్‌సీపీజీఈటీ నోటిఫికేషన్‌ను తెలంగాణ విద్యాశాఖ ఈ రోజు విడుదల చేస్తుంది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, మహిళా విశ్వవిద్యాలయాలు, జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని కళాశాలల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

---------------------------

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఆధునిక సమాజంలో కుటుంబాల ప్రాధాన్యత పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్న ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది మే 15వ తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. సమాచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు కుటుంబ వ్యవస్థ పట్ల అవగాహన కలిగించాలన్న ఆశయంతో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

దక్షిణ అంతర్భాగ కర్ణాటక, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం కేరళ నుంచి కర్ణాటక మీదుగా మరఠ్వాడా వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ద్రోణి ఆవరించి ఉంది. అదే సమయంలో రాష్ట్రంపై ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా రానున్న ఐదు రోజులు ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. వర్షాలతోపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవిస్తాయని, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

మరోవైపు తెలంగాణలో కూడా రాగల మూడు రోజులపాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నారాయణ పేట, గద్వాల జిల్లాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.

======================